



కరసాము ప్రదర్శన

సందడే సందడి

- విజయనగరం ఉత్సవాలు ప్రారంభం
- హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్
- క్రీడా పోటీలను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- వివిధ వేదికల్లో ఆకట్టుకుంటున్న నాటికలు
- ప్రత్యేక ఆకర్షణగా లేజర్ షో


కేరళ డ్రమ్స్

హాట్‌బెలూన్

లేజర్ షో

మెగా ఈవెంట్‌లో ప్రత్యేక నృత్యం

విజయనగరం ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. విజయనగరం సంస్కృతి, సంప్రదాయాలు, కళలు ఉట్టిపడే ప్రదర్శనలు, కత్తిసాము విన్యాసాలు, పులివేశాలు, నాటికలు, లేజర్ షో నడుమ సందడిగా ఆరంభమయ్యాయి. ఉత్సవాలు తొలిరోజే ఆబాలగోపాలాన్ని ఉర్రూత లూగించాయి. నాగిని, కోలాటం, కర్రసాము ప్రదర్శనలతో పాటు ఆనందగజపతి కళాక్షేత్రంలో అన్నమయ్య కీర్తనలు, ఇతర వేదికల్లో శతాధిక కవి సమ్మేళనం, ఫ్లవర్ షో, హాట్‌బెలూన్, డ్వాక్రాబజార్, సాంఘిక నాటికలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి.
విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్/ రింగురోడ్డు, అక్టోబరు 13


బాలికల నృత్య అభినయం

అయోధ్యమైదానంలో బాణసంచా వెలుగులు

విజయనగరం ఉత్సవాలతో నగరానికి ప్రత్యేక కళ వచ్చింది. ఎటు చూసినా సందడి కనిపిస్తోంది. జనాలతో కళకళలాడుతోంది. విజయనగరం ఉత్సవ ర్యాలీ ఆదివారం ఉదయం ఉత్సాహంగా సాగింది. పైడితల్లిమ్మ ఆలయం నుంచి అయోధ్యమైదానం వరకూ జరిగింది. కోలాటం, తప్పిటగుళ్లు, బిందెలు నృత్యం, కర్రసాము, కత్తి సాము, విచిత్ర వేషాలు, వివిధ జానపద కళారూపాల నడుమ ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. 55 బృందాలతో వేలాది మంది ర్యాలీలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రాంత వైభవాన్ని, ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సి అవసరం ఉందని చెప్పారు. అనంతరం మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా గుర్తించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం గౌరవాన్ని, కీర్తిని నలుదిశలా చాటడానికి ఈ ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 12 వేదికలపై వివిధ రకాల సంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తా మన్నారు. సభకు అధ్యక్షత వహించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, జేసీ సేతు మాధవన్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం వైభవాన్ని చాటిన లేజర్ షో..

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా పైడితల్లి అమ్మవారి చరిత్ర, గొప్పతనాన్ని వివరిస్తూ రూపొందించిన లేజర్ షోను కోట వద్ద శనివారం రాత్రి మంత్రి శ్రీనివాస్ ప్రారంభించారు. చరిత్రను నేటి తరానికి తెలియజేయాలనే ఈ లేజర్ షోను రూపొందించామన్నారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ పండగ మూడు రోజులూ లేజర్ షో ప్రదర్శిస్తారన్నారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు దేశంలో మైసూరు ఉత్సవాలకు ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, అంతటి ఖ్యాతి విజయనగరం ఉత్సవాలకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, టీడీపీ సీనియర్ నాయకులు ఐవీపీ రాజు, బొద్దుల నర్సింగరావు, కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం ఉత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

ఆకట్టుకున్న నాటికలు

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గురజాడ కళాభారతిలో పౌరాణిక, సాంఘిక నాటికలు, ఏకపాత్రాభినయాలు అహూతులను ఆకట్టుకున్నాయి. శ్రీ కృష్ణుడి గయోపాఖ్యానం, యుద్ధ సీన్, మహాభారతంలోని ఘట్టాలు, హరిశ్చంద్ర నాటకంలో కాటికా పరి సీన్లు ప్రేక్షకులను కట్టిపడేశాయి. కన్యాశుల్కం, ఆరోజు కోసం.. తేరేనామ్.. ఆనందో బ్రహ్మ.. అంతర్యామి నాటికలు ఆహూతులను రంజింపజేశాయి. దేవి దండు మారమ్మ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రవృద్ధ ఆశ్రమం, యువరానర్ నాటికలు ప్రత్యేకంగా నిలిచాయి.


విజయనగరం ఉత్సవాలకు ఒంటె

ఆలోచింపజేస్తున్న ప్రదర్శనలు..

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సోమవారం కోటలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రారంభించారు. ఇక్కడ స్టాంపులు, నాణేల ప్రదర్శన, ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. కాగా రాజీవ్ స్టేడియం, గురజాడ గ్రంథాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్, లేజర్ షోలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హాట్ బెలూన్ షో శనివారం సా యంత్రమే మొదలైంది. విజయ నగరం ఉత్సవాల్లో భాగంగా ఎంఆర్ రిక్రియేషన్ క్లబ్ సాహిత్య వేదికపై ఆదివారం ప్రదర్శించిన కవి సమ్మేళనం, భువన విజయం ఆకట్టుకున్నాయి. మహారాజా సాంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ గంటా జనార్ధననాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.


కాళీమాత వేషధారణలో..

క్రీడలూ ముఖ్యమే..: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విజయనగరం టౌన్, అక్టోబర్ 13: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని, ఈ విషయాన్ని ప్రధానంగా తల్లిదండ్రులు గుర్తించి వారిని ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సూచించారు. విజయనగరం ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విజ్జీ మైదానంలో చేపట్టిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల మాయలోపడి శారీరక శ్రమకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని, తల్లిదండ్రులు వారిని క్రీడలపైనా ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలన్నారు. క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెర్ప్, ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు ఐవీపీ రాజు, కర్రోతు నర్సింగరావు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

నేడు తొలేళ్లు

- అమ్మవారి పండగకు ఏర్పాట్లు పూర్తి


అమ్మవారిని దర్శించుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, అక్టోబరు 13: పైడిమాంబ సిరిమానోత్సవానికి ముందు జరిగే ఘట్టం.. తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేస్తారు. వివిధ రకాల పూలతో అలంకరిస్తారు. భక్తులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం సిరిమానోత్సవం జరిగే వరకూ పైడిమాంబను విస్తృతంగా దర్శించుకుంటారు. తొలేళ్ల నేపథ్యంలో రాజవంశీయులు పైడిమాంబకు సారే, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల మధ్య పూసపాటి వంశీయులు ఈ తంతులో పాల్గొంటారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడంతో పాటు ప్రత్యేక పూజలకు అవకాశం కల్పిస్తారు. ఇక తొలేళ్ల రోజు కూడా నగరంలో వివిధ వేషాలు సందడి చేయనున్నాయి.

పైడిమాంబకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఊరేగింపులతో వచ్చి ఆదివారం ముర్రాటలు సమర్పించారు. ఈ నేపథ్యంలో నగరంలోని జంక్షన్లు భక్తులతో కిటకిటలాడాయి.. పైడిమాంబ నామస్మరణతో నగరం పులకించింది. ఆదివారం రాత్రి 11 గంటల వరకూ పైడిమాంబ ఆలయం తెరిచే ఉంచారు.

- **70 మంది దేవదాయశాఖ సిబ్బంది..:** పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి దేవదాయశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. సిరిమానోత్సవం అంతక ముందు జరిగే తొలేళ్ల ఉత్సవానికి ఇప్పుడున్న సిబ్బందితో పాటు అదనంగా 70 మంది సేవలను వినియోగించుకోనున్నారు.

ఉత్సవాలు.. జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైం, అక్టోబరు 13: విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ తొలేళ్లు, సిరిమానోత్సవం పురస్కరించుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. నగరంలోని అయోధ్యమైదానం, సిరిమాను తిరిగే ప్రధాన జంక్షన్లు, ట్రాఫిక్ మళ్లింపులు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను శనివారం పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రధాన మార్గంలో జంక్షన్ల వద్ద బారికేడ్లను, వాహనాల మళ్లింపుల వద్ద భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసేందుకు 18 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు.

మద్యం షాపులు ఎవరికో?

- నేడు లాటరీ
- 153 దుకాణాలకు 5237 దరఖాస్తులు



గజపతినగరం/ విజయనగరం క్రైం, అక్టోబరు 13: మద్యం టెండర్లు శుక్రవారం సాయంత్రంతో ముగిసిన సంగతి తెలిసిందే. 153 షాపులకు 5,237 దరఖాస్తులు దాఖలయ్యాయి. వీటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.104కోట్ల 74లక్షలవరకు ఆదాయం రానుంది. 14వ తేదీన కలెక్టరేట్ ఆవరణలో లాటరీ తీసి 16వ తేదీ నుంచి కొత్తదుకాణాలకు ఎక్సైజ్ అధికారులు అనుమతించనున్నారు. ఒక్కో మద్యం షాపునకు 30 దరఖాస్తులు దాఖలైనట్టు ఎక్సైజ్‌శాఖ అధికారుల సమాచారం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులను ఎక్సైజ్ అధికారులు స్వీకరించారు. ప్రారంభంలో మద్యం షాపులకు దరఖాస్తులు తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించింది. దుకాణం పొందేవారికి 2026 సెప్టెంబర్ 30వ తేదీవరకు లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. కొత్తమద్యం కోసం మందుబాబులు కూడా ఎదురు చూస్తున్నారు. కాగా ఇప్పటివరకు ప్రభుత్వ పరంగానే మద్యం షాపులు ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. ఆ షాపులకు ఈనెల 16వ తేదీతో చెల్లు. కాగా షాపులకోసం దరఖాస్తులు చేసుకున్నవారు తమకే షాపు దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. అధికంగా సేల్స్ జరిగే ప్రదేశాల్లో షాపులు పెట్టేప్రయత్నంలో ఉన్నారు. అందుకు అవసరమైన షాపులకు కొందరు అడ్వాన్స్‌లు కూడా చెల్లించారని సమాచారం. జిల్లా వ్యాప్తంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్యం షాపులకు వారే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

డ్రా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

మద్యం షాపుల డ్రా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించే ఈ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూస్తామన్నారు. లాటరీ ప్రక్రియ 8 గంటలకే ప్రారంభమౌతుందన్నారు. మూడు స్లాట్‌లలో లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొదటి స్లాట్‌లో 8 నుంచి 10 గంటల వరకూ, రెండో స్లాట్‌లో 10 గంటల నుంచి 12 గంటల వరకూ 51 నుంచి 100 షాపులకు, మూడో స్లాట్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 101 నుంచి 153 షాపులకు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. డ్రాలో ఒక్కో షాపునకు ఒక్కొక్కరిని ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థి 24 గంటల్లోగా లైసెన్సు ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

దిక్సూచి
DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్పియర్ అని అంటారు. గ్రీకుభాషలో హైడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌2ఓ(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సులో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్పైయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్పియర్ అంటారు. దీనిని అశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు. భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.



జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.

- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉత్పత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటిసారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, ÷)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (△, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్ని ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 6 బి) 4 సి) 5 డి) 3


సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు

నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 4 బి) 2 సి) 1 డి) 5


సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు

మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు

రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు

నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S లుఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు


దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్థరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాలపాలయ్యారు. మరి కొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్థరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికెర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీ పడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవ మూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికెర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గి నబుదిహాల్ గ్రామనికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.



హరీష్, మల్లికార్జున


రవి కుమార్

తిరుమలలో వైభవంగా చక్రస్నానం


చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్ర్కీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్లైండ్ మన్' అనే ఎక్స్ పేజ్‌లో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి



శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చా రు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.







ఉత్సవ ర్యాలీలో అందరినీ పలకరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి



ఒంటె, గుర్రాలను పరిశీలిస్తున్న స్పీకర్, మంత్రి సంధ్యారాణి



విందెల డ్యాన్స్



హాస్య నటుల స్కిట్ చూస్తూ కలెక్టర్ నవ్వులు



ఉత్సవ ర్యాలీలో గిరిజనుల థింసా నృత్యం



మెగా ఈవెంట్‌కు హాజరైన ప్రజలు



విజయనగరం వీధుల్లో ప్రారంభోత్సవ ర్యాలీ



నృత్య ప్రదర్శనలో బాలికలు



స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు



పుష్ప ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పూల బొకేలు



మంత్రి శ్రీనివాస్, ఎంపీ అప్పలనాయుడుతో హాస్యనటులు

షో అదిరింది

- ఆకట్టుకున్న హాస్యనటులు, సల్సా డ్యాన్స్, మ్యూజికల్ నైట్
- మీడియాను దూరం పెట్టిన ఉత్సవ కమిటీ

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ టౌన్ అక్టోబరు 13 : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అయోధ్య మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మెగా ఈవెంట్ యువతను, సంగీత, హాస్య ప్రియులను ఉర్రూతలూగించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో రాత్రి 7 గంటలకు యాంకర్ మృదుల వ్యాఖ్యానంతో వినోద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ముందుగా విజయనగరానికే చెందిన ఇండియన్ ఐడల్ పవన్ సాయి ఆర్కెస్ట్రా బృందం, గజల్ వినోద్ ఆలపించిన గజల్స్ అలరించాయి. కోల్‌కతా నృత్య బృందం ప్రదర్శించిన సల్సా నృత్యాలు యువతను ఆకట్టుకున్నాయి. టీవీ కళాకారులు హైపర్ ఆది, రైజింగ్ రాజు, దొరబాబు, మురళీధర్, గణపతి, అల్లరి అర్జున్, అప్పారావు, సరదా సత్తిపండు, తదితరులు ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ కడుపుబ్బా నవ్వించాయి. గాయకులు సాహితీ చాగంటి, పవన్ సాయి, అర్జున్ కౌండిన్య, సాయి చరణ్, దామిని తదితరులు ఆలపించిన సినీ, భక్తి గీతాలను ప్రేక్షకులు అమితంగా ఆస్వాదించారు. బాణసంచా కాల్పడంతో విరజిల్లిన వెలుగుదివ్వెలతో ఉత్సవ శోభ అంబరాన్ని అంటింది.

కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. వీరితో పాటు కలెక్టర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, గొండు శంకర్, అధికారులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొని ఈవెంట్‌ను ఆద్యంతం తిలకించారు.

అధికార పార్టీ నేతలు, పోలీసులు హల్‌చల్

స్థానిక అయోధ్య మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మెగా ఈవెంట్‌లో అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు, పోలీసులు హల్‌చల్ చేయడంతో మీడియా ప్రతినిధులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. డ్యూటీ పాస్‌లు మంజూరు చేసినా, వారిని కనీసం గ్యాలరీ వద్దకు రానివ్వక పోవడంతో మీడియా ప్రతినిధులు, కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లు అక్కడ జరుగుతున్న కార్యక్రమాన్ని కవర్ చెయ్యటానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులకు ఫోన్లు చేసినా నాయకుల ఒత్తిడితో వారు ఏమీ చెయ్యలేక చేతులెత్తేశారు. పోలీసులకు, పొలిటీషియన్స్‌కు, తెలిసిన వారైనా, ఫోన్ చేయించినా వారికి వీవీఐపీ హోదా ఇచ్చి మరీ రాచమర్యాదలతో ప్రత్యేక గ్యాలరీలో కూర్చోబెట్టారు.



పైడిమాంబ జాతరకు విస్తృత ఏర్పాట్లు

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం పైడిమాంబ జాతర మహోత్సవం, సిరిమాను ఉత్సవంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేశామని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే, టోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా, 94408 12449 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

21లోగా ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

కలెక్టరేట్: రాష్ట్రంలోని ఎస్సీఎస్టీ కులాలకు చెందిన వారికి డీఎస్సీ పరీక్షకు ఉచితంగా స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వడం తోపాటు వసతి సదుయం కల్పించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలలు పాటు అభ్యర్థులు శిక్షణ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21తేదీలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు

రక్తదాన శిబిరం

కలెక్టరేట్: పైడితల్లిమ్మ పండగ సందర్భంగా ఆదివారం న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, ఏపిజే అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్లడ్ డోనర్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన

బాడంగి: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్‌పై అవగాహన కల్పించినట్టు గ్రంథాలయాధికారి ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రతి ఆదివారం ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలచేత పలు ఆధ్యాత్మిక, కథల పుస్తకాలను చదివిస్తున్నామన్నారు. పలు రకాల క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయని, వీటిని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గొర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి

శృంగవరపుకోట: మండలకేంద్రమైన ఎస్.కోట ఏజీఎల్ కళాశాలలో ప్రముఖ స్వాంతంత్ర సమరయోదుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొల్లి కోటేశ్వరావు, జీఎస్ నాయుడు, కూనిరెడ్డి వెంకటరావు, డాక్టర్ త్రినాథరావు తదితరులున్నారు.

ఆకట్టుకున్న నవదుర్గ అవతారాల ప్రదర్శన

రాజాం: మున్సిపాలటీ పరిధిలోని నరసింహనాయుడు కాలనీలో ఆదివారం చిన్నారులు చేసిన నవదుర్గ అవతారాల ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నవదుర్గ అవతారాలు ప్రదర్శన చేసినట్లు తెలిపారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కీర్తిస్తూ ఈ ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని చిన్నారులను కాలనీ వాసులు కొనియాడారు.



చిన్నారుల వేషధారణలు

భక్తులతో ఓపిగ్గా వ్యవహరించాలి

- విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల, సిరిమానోత్సవం పండుగ సందర్భంగా బందోబస్తు నిమిత్తం విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది భక్తులతో సంయమనం పాటించాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందితో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరితో గొడవ పడొద్దన్నారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే, ఇన్‌ఛార్జిగా వుండే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రతాపరంగా భక్తులకు ఖచ్చితమైన సూచనలు చేయాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పోలీసుశాఖకు మంచి పేరు తెచ్చేందుకు కష్టించి పనిచేయాలన్నారు. రిలీవర్ వచ్చేంత వరకూ అప్పగించిన బాధ్యతల నుంచి వైదొలగవద్దన్నారు. సిరిమానోత్సవం పూర్తయిన తరువాత.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ విధుల నుంచి నిష్క్రమించవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, ఎల్ మోహనావు, డీఎస్పీలు శ్రీనివాసరావు, రాఘవులు, పి శ్రీనివాసరావు, వీరకుమార్, నాగేశ్వరరావు, సీతారాం, రాంబాబుతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

పోలీసుల తుపాకులు, వాహనాలకు ప్రత్యేక పూజలు

విజయనగరం క్రైం: దుర్గామాత ఆశీస్సులు జిల్లా ప్రజలపై మెండుగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఏఆర్ విభాగంలో పోలీసులు వినియోగించే ఆయుధాలు, పోలీసు వాహనాలకు ఎస్పీ దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెడుపై మంచి విజయం సాధించడం ప్రతీకగానూ, దుష్టశిక్షణ, శిష్టరక్షణకు పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలకు, వాహనాలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించడం సాంప్రదాయమన్నారు. దసరా పండుగ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ కమాండెంట్ మల్లికాగార్గ్ దంపతులు, పోలీసు అధికారులు, సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐలు సీఐలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి తీరంలో యువకుడి గల్లంతు



అచ్యుతరావు (ఫైల్)

పూసపాటిరేగ/గరివిడి: సముద్రంలో యువకుడు గల్లంతైన ఘటన పూసపాటి రేగ మండలంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలం దుమ్మెద గ్రామానికి చెందిన ఇజ్జిపురపు అచ్యుతరావు(25) గ్రామంలోని ఏర్పాటు చేసిన దేవీ విగ్రహాన్ని నవరాత్రుల అనంతరం నిమజ్జనం చేసేందుకు గ్రామస్థులతో పాటు చింతపల్లి సముద్రానికి వచ్చాడు. నిమజ్జనం అనంతరం అందరూ ఒడ్డుకు చేరుకోగా ఐదుగురు యువకులు సముద్రంలో లోతుగా వెళ్లారు. వారిలో ముగ్గురు ఈతకొట్టుకొని ఒడ్డుకు చేరుకోగా మిగిలిన ఇద్దరు యువకులు దూరంగా కొట్టుకొని పోవటం చూసి స్థానికంగా ఉన్న మత్యకారులు బోటుతో వెళ్లి ఒక యువకుడిని రక్షించి తీసుకువచ్చారు. మరో యువకుడిని రక్షించేందుకు తిరిగి బోటుపై వెళ్తుండగా యవకుడు గల్లంతయ్యాడు. కొంతసేపు మత్యకారులు గాలించినా ఫలితం లేకపోవటంతో మత్యకారులు వెనుకకు వచ్చేసినట్లు సహచరులు చెబుతున్నారు. గల్లంతైన యువకుడికి ఇటీవలే విశాఖలో ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. దసరా సెలవులు కావటంతో గ్రామానికి వచ్చాడని, అంతలోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, రాము నాయుడు విలపిస్తున్నారు. వీరికి కుమారిడితో పాటు, ఒక కుమార్తె ఉన్నారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

రామచంద్రరాజు సేవలు మరువలేనివి

- కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం టౌన్, అక్టోబర్ 13: క్రీడా రంగానికి, ముఖ్యంగా విజ్జీ మైదానం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన రామచంద్రరాజు సేవలు మరువ లేనివని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ మొట్టమొదటి కార్యదర్శి రామచంద్రరాజు వందో జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం విజ్జీ క్రికెట్ మైదానంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌గజపతిరాజు ముందుగా రామచంద్రరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అభివృద్ధికి రామచంద్రరాజు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, మాజీ ట్రెజరర్ గజపతిరాజు, నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ వాసుదేవరాజు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ట్రెజరర్ పి.సీతారామరాజు, టీడీపీ సీనియర్ నాయకులు ఐవీపీ రాజు, మాజీ రంజీ క్రీడాకారులు సన్యాసిరాజు, రంజీ క్రీడాకారుడు పి.తపశ్వి, అధికారులు, నాయకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న చిన్న శ్రీను

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు ఉత్తరాంధ్ర ప్రజలంతా సంఘటితంగా పోరాడాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి కోసం విశాఖ ఉక్కును పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ, విశాఖ ఉక్కును పార్టీలతో సంబంధం లేకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంవీజీఆర్ కృష్ణాజీ, రొంగలి పోతన్న, రమేష్, గేదెల సత్యం, వెంకటరమణ, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగింపు దశకు గ్రామదేవత ఉత్సవాలు



వీధుల్లో విద్యుద్దీపాలంకరణలు


రాజాం రూరల్: రాజాంలో నెలరోజుల పాటు నిర్వహించిన గ్రామదేవతల ఉత్సవాలు ఈనెల 16తో ముగియనున్నాయి. 15న బురదలపోలమ్మ తల్లి ఘటోత్సవ ఉత్సవం మంగళవారం ఉదయం ప్రారంభం కానుంది. తిరువీధి ఉత్సవం అనంతరం దాదాపుగా 16న రాత్రి ఘటోత్సవ నిమజ్జనం పూర్తికానుంది. బురదలపోలమ్మ తల్లి ఘటోత్సవం ముగియడంతో నెలరోజులు పాటు నిర్వహించే ఉత్సవాలు ముగియనున్నాయి.

గిరిజన మహిళకు సుఖప్రసవం

- అర్థరాత్రి వేళ స్పందించిన వైద్యాధికారి
- పీహెచ్‌సీకి తరలించి చికిత్స

సాలూరు రూరల్: మారుమూల, గిరిశిఖర గ్రామాల్లో గిరిజన మహిళలకు కాన్పు ఇంటి వద్ద జరిపించుకోవడానికే మొగ్గు చూపుతారు. ఏవోబీలో తుండ పంచాయతీలో ఉన్న రావిమానువలస గ్రామానికి చెందిన గుంత మిథుల(30) ఆసుపత్రి అంటే భయపడేది. ఆమె గర్భిణీ కావడంతో వైద్యసిబ్బంది ఈ నెల 3న పరీక్షలు చేసి మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యాధికారి డి. శివకుమార్ సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను వైద్యులు పరీక్షించి సుఖ ప్రసవం కోసం ఘోషాసుపత్రికి రిఫర్ చేశారు. ఆమెను అంబులెన్స్‌లో విజ యనగరం తరలిస్తుండగా అంబులెన్స్ సాలూరు బైపాస్ రోడ్డుకు వచ్చేసరికి ఆమె అంబులెన్స్ నుంచి దిగిపోయి వైద్యసిబ్బంది నచ్చజెప్పినా వినకుండా రావిమానువలసకు వెళ్లిపోయింది. దీంతో ఆమెను కనీసం సాలూరులో గర్భిణుల వసతిగృహంలో ఉంచడానికి సాలూరు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు నచ్చజెప్పినా వినకుండా వెళ్లిపోయింది. అనంతరం ఆమెకు ఈ నెల 11న శుక్రవారం అర్థరాత్రి నొప్పులు వస్తున్నాయని తెలియడంతో వైద్యాధికారి శివకుమార్‌కు తెలియజేశారు. ఆమె పరిస్థితి తెలిసిన ఆయన వెనువెంటనే గ్రామానికి చేరుకుని వైద్యసేవలందించారు. ఆ రాత్రే 108ను రప్పించి మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. శనివారం వేకువజామున ఆమెకు సుఖప్రసవం చేయించారు. మగబిడ్డ పుట్టడంతో వైద్య సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. వైద్యాధికారి, సిబ్బందికి భర్త సుందరరావు ఆనందంతో ధన్యవాదాలు తెలుపుకున్నారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి శివకుమార్ ఆదివారం తెలిపారు.

ప్రజల మనోభావాలు అర్థం చేసుకోండి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జామి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంత ప్రజల మనోభావాలు అర్థం చేసుకోవాలని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మండలకేంద్రమైన జామిలో వెలమసంఘం జిల్లా ప్రతినిధి గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ స్వాంతంత్రసమరయోదుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరు పెట్టిందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయనపేరు తొలగించడం సరికాదన్నారు. జడ్పీటీసీ గొర్లె సరయూ, గంట్యాడ జడ్పీటీసీ నరసింహమూర్తి, నాయకులు తదితరులు ఉన్నారు.

జామి: మండలంలోని అలమండ గ్రామంలో బుచ్చిఅప్పారావు జయంతి సందర్భంగా వెలమాంధ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న దివ్యాంగులు, నిరుపేదలకు 111 మందికి దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గొంప కృష్ణ మాట్లాడారు. మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, మాజీ జడ్‌పీటీసీ పెదబాబు, గనివాడ ఎర్నాయుడు, లగుడు అప్పల నాయుడు, వెలమాంధ్ర ఫౌండేషన్ ప్రతినిదులు మూర్తి, సత్యనారాయణ తదితరులున్నారు.

చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి ఉంది

రాజాం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో వర్గీకరణ అమలు పరిచిన వ్యక్తిగా చిత్తశుద్ధితో పనిచేస్తారని మంద కృష్ణమాదిగ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన తరువాత మొదటిసారిగా ఉత్తరాంధ్ర జిల్లా పర్యటనలో భాగంగా రాజాం తృప్తి రిసార్టులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజాం నియోజకవర్గంలోని రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల మాదిగ రెల్లి, ఎస్సీ ఉపకులాలు పెద్దలు కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అరసాడ ఆనందరావు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యందవ నారాయణరావు, పౌలు, రాజాం నియోజకవర్గం కన్వీనర్ యందవ నారాయణరావు కుల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిన తరువాత మొట్ట మొదటిసారిగా ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్న మందకృష్ణ మాదిగను రాజాం నియోజకవర్గం బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కంచరాం తృప్తిరిసార్ట్స్‌లో ఆదివారం కలుసుకున్నారు. సకాలంలో రిజర్వేషన్ అమలు పర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, పట్టణ అధ్యక్షులు జొన్నాడ రంజిత్ తదితరులు ఉన్నారు.



మందకృష్ణ మాదిగకు స్వాగతం పలుకుతున్న కులపెద్దలు

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ ఏడాది మే 18న ఎస్‌బీఐ సేవా కేంద్రంలో జరిగిన చోరీలో ల్యాప్‌టాప్‌తోపాటు కొంత నగదు కూడా చోరీ జరిగినట్టు సేవా కేంద్రం నిర్వాహకుడు పీవీ సత్యారావు ఫిర్యాదు చేశారు. అయితే ఈ చోరీకి పాల్పడిన మెంటాడ మండలం పోరం గ్రామానికి చెందిన జోగాడ భగవాన్ శనివారం స్థానిక సాయిశ్రీనివాసా లాడ్జి వద్ద అనుమానాస్పదంగా తిరగడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అయితే ఆరికతోట గ్రామంలో కూడా ఒక ఇంటిలో చోరీ చేసి కొంత బంగారాన్ని కూడా దొంగిలించినట్టు అంగీకరించాడు. ఇతనికి చాలా నేరాలతో సంబంధం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈయనను అరెస్టు చేసి, సాలూరు కోర్టుకు తరలించామని తెలిపారు.

దేవుని నెలివాడలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ గణేష్

నెల్లిమర్ల: రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ గ్రామంలో చోరీ జరిగింది. ఆ గ్రామంలోని దంతినాడ ఉమామహేష్ తన భార్యతో కలిసి విజయదశమి సందర్భంగా శనివారం సాయంత్రం రామతీర్థంలోని అత్తవారింటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దేవుని నెలివాడలోని తన ఇంటికి వచ్చి, తలుపులు తీసేసరికి ఇంటికి వెనుక వైపున ఉన్న కిటికీ తలుపులు, అద్దం పగిలి ఉండడం, బీరువా తెరిచి ఉండడంతో విస్తుపోయాడు. వెంటనే 100 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఈ చోరీలో లక్ష రూపాయిల నగదు తోపాటు ఒకటింపావు తులాల బంగారు ఆభరణాలు కూడా పోయాయని ఉమామహేష్ విలేకర్లకు తెలిపాడు. చోరీ జరిగిన ఇంటిని నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్‌తో పాటు విజయనగరం నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అదే గ్రామంలో ఇటీవల మరో రెండు చోరీలు కూడా జరిగినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఒక ఇంట్లో రెండు గ్యాస్ బండలు మూడు రోజుల కిందట చోరీ జరగ్గా, గత నెలలో 16న కార్పెంటర్ పనిచేసే మొత్తం యంత్ర పరికరాలు అన్ని చోరీకి గురయినట్లు గ్రామస్థులు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న కృష్ణమాదిగ

రామభద్రపురం: డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత నడుం బిగించాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఆరికతోట గ్రామంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన శనివా రం రాత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతిఒ క్కరూ సమాజాభివృద్ధిలో పాల్గొనాలని కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని అన్నారు. వర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయా లని ఆయన కోరారు. ఈ ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి తమకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరాపల్లి బిక్షాలు, ఎంఆర్పీఎస్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు ముమ్మడివరకు చినసుబ్బారావు, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీను, డాక్టర్ సురగాల సత్యానందం, ఎంఆర్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పెంకి రవికుమార్, ఎంఈవో సురగాల విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పల్లవి ప్రతిభ


కోచ్ రాముతో పల్లవి

నెల్లిమర్ల: హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన ఎస్.పల్లవి సత్తా చాటింది. 71కిలోల కేటగిరీ, సీనియర్ విభాగంలో పాల్గొని స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 114 కిలోలు మొత్తం 208 కిలోలు బరువు ఎత్తి పల్లవి రెండు రజత పతకాలు సాధించిందని కోచ్ చల్లా రాము తెలిపారు. ఇంతవరకు సీనియర్ విభాగంలో ఆంధ్ర నుంచి మెడల్ సాధించిన వారిలో పల్లవి ప్రథమురాలని చెప్పారు. అలాగే ఈ పోటీల్లో పల్లవి సీనియర్ విభాగంలో రెండు పతకాలు సాధించడం గొప్ప విషయమని అన్నారు. ఈ పోటీల్లో ఇప్పటికే జిల్లాకు చెందిన మరో ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. పల్లవిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మీనరేంద్ర, కార్యదర్శి, కోచ్ చల్లా రాము, అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు లక్ష్మి, దీన్బాబు, బడేటి వెంకటరామయ్య, కోచ్‌లు అల్లూరు శ్రీనివాసరావు, సీహెచ్ మధు, చల్లా రాము అభినందించారు.

గుర్లలో డయేరియా

గుర్ల: గుర్ల గ్రామంలో గత రెండు రోజులుగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి. శనివారం, ఆదివారం పలువురు వాంతులు, విరోచనాలతో స్థానిక పీహెచ్‌సీలో, నెలిమర్ల, విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరారు. కొందరు ఆరోగ్యం కుదుటపడడంతో ఇళ్లకు వచ్చేశారు. ఈనేపథ్యంలో గుర్ల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని పీహెచ్‌సీ వైద్యుడు చెన్నై తెలిపారు. ఇప్పటికే గ్రామస్థులు ఈవోపీఆర్డీకి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. కెల్ల గ్రామంలో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది. గుర్ల, కెల్ల గ్రామాల్లో తాగునీటిని పంపిణీ చేసే ట్యాంకర్లలో ఎరువులు వాడే సంచులు కడగడం వల్ల ఈ సమస్య వస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

హక్కుల కోసం పోరాడాలి


జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

రేగిడి: హక్కుల కోసం కార్మికులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈఐడీప్యారీ సుగర్స్ ఎంప్లయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రామమూర్తినాయుడు, యునియన్ అధ్యక్ష, కార్యదర్శిలు శ్రీధర్, సతీష్‌లు పిలుపునిచ్చారు. సంకిలి ఈఐడీ ప్యారీ ఎంప్లయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటై పది వసంతాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో యూనియన్ ఆవిర్భావ వేడుకలు శనివారం కార్మాగార మెయిన్‌గేట్ వద్ద నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ ప్రతిప్రతినిధులు వీఆర్‌సీ నాయుడు, శ్రీనివాసరావు, రాజేష్, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

విజయనగరం టౌన్: శ్రీచెస్ అసోసియేషన్, ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అండర్-15 ఓపెన్ టోర్నీలో ప్రతిభ చూపిన ఎనిమిది మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని రాష్ట్ర చెస్ అసోసియేషన్ సీఈవో కె.జ్వాలాముఖి తెలిపారు. బాలికల్లో షణ్ముకప్రియ, పరిణీత, నితీష, కె.సంజన ఎంపిక కాగా, బాలుర నుంచి జి.లక్ష్మీ చరణ్‌నాయుడు, కె.ప్రహ్లాద్, మువ్వల నిహార్, ఎం.నిఖిలేష్ ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 తేదీల్లో గుంటూరులో నిర్వహించే ఏపీ రాష్ట్ర అండర్- 15 చెస్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ఘనంగా దసరా

- అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా పండగను శనివారం విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వాహనాలకు పూజలు చేశారు. దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా మండపాల్లోని అమ్మవారి విగ్రహాలను బయటకు తీసి, ఘనంగా ఊరేగించారు. అనంతరం సమీప నదుల్లో నిమజ్జనం చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


విజయనగరం/రాజాం: అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యే కళా వెంకటరావుకు అందజేస్తున్న అర్చకులు


బొబ్బిలి: దేవీ నవరాత్రి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన


నెల్లిమర్ల: రామతీర్థంలోని బోడికొండపై పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


గంట్యాడ: నరవ గ్రామంలో అమ్మవారి వద్దకు సారె తీసుకువెళ్తున్న దృశ్యం


బొబ్బిలి: దాడితల్లికి పాలాభిషేకం


రేగిడి: సంకిలిలో దుర్గమ్మ ఊరేగింపు


వేపాడ: దీపారాధన నిర్వహిస్తున్న దృశ్యం


రాజాంరూరల్: నవదుర్గ అమ్మవారి నిజ, నిత్యరూపం


బాడంగి: దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నేటి నుంచి 'పల్లె పండుగ'

- 2,199 పనులకు రూ.151.90 కోట్లు
- గ్రామాల్లో అభివృద్ధి పనులు మంజూరు
- ఉద్యమంలా చేపట్టాలని ప్రభుత్వం పిలుపు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేటి నుంచి పల్లెల్లో అభివృద్ధి పనుల సందడి ప్రారంభం కానుంది. ఐదు సంవత్సరాలుగా గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఇప్పుడు అధికారం మారడంతో కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధిపై దృష్టిపెట్టింది. పల్లె పండుగ పేరుతో సోమవారం నుంచి ఈ నెల 20 వరకూ సీసీ కాలువలు, రహదారులు, డ్రెయిన్లతో పాటు వివిధ రకాల పనులను ప్రారంభించనున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొంటారు.



పల్లెపండగ పోస్టర్

గ్రామసభలో పనుల గుర్తింపు..

జిల్లాలో 773 పంచాయతీలు ఉన్నాయి. ఆగస్టు 23న జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. అందులో రాజకీయా లకు అతీతంగా గ్రామపెద్దలు, ప్రజలు అందర్నీ భాగస్వామ్యం చేశారు. ప్రజోపయోగ పనులు గుర్తించారు. జిల్లాలో 2,199 పనులను గుర్తించారు. ఇందుకుగాను రూ.151.90 కోట్లు కేటాయించారు. ఈ నెల 14 నుంచి 20లోగా శంకుస్థాపనలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. సంక్రాంతి లోగా పనులు పూర్తిచేయాలని సంకల్పించింది. ఈ కార్యక్రమానికి 'పల్లె పండుగ' అని నామకరణం చేసింది. జిల్లాలో 7 నియోజకవర్గాలకు కలిపి గ్రామసభల్లో గుర్తించిన పనులకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మన జిల్లాకు రూ.151.90 కోట్లు కేటాయించింది.

హక్కులు, నిధులకు కత్తెర..

సర్పంచ్‌లకు వైసీపీ ప్రభుత్వం కత్తెర వేసింది. పాఠశాలల నిర్వహణను తల్లిదండ్రుల సమన్వయ కమిటీలకు అప్పగించింది. ఆస్పత్రుల నిర్వహణకు అభివృద్ధి కమిటీలను నియమించింది. వ్యవసాయ పనుల పర్యవేక్షణ బాధ్యతను రైతుబరోసా కేంద్రాలకు అప్పగించింది. మొన్నటి వరకు వీధి దీపాల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. ఏ మాత్రం ఆదాయమున్న వారపు సంతలను మార్కెటింగ్ శాఖ తన పరిధిలోకి తీసుకుంది. పంచాయతీలకు చెందిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. జగనన్న కాలనీల లేఅవుట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తోంది. దీంతో పంచాయతీ ఆస్తులన్నవే గ్రామాల్లో కరువయ్యాయి. కేవలం ఆర్థికభారంగా పరిగణించే పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి బాధ్యతలను మాత్రం పంచాయతీలకు అప్పగించింది. దీంతో చిన్నచిన్న పనులకు కూడా ఎమ్మెల్యే ఎంపీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన ఇంటి పన్ను, నీటి తీరువా, వృత్తి పన్ను, ఆస్తుల బదిలీలో పన్ను వాటా, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం వంటివి ప్రభుత్వ ఖాతాకే జమ అవుతున్నాయి. తిరిగి పంచాయతీలకు కేటాయించడం లేదు. దీంతో పదవి ఉన్నా ఏంచేయలేని స్థితిలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారు.

హక్కులకు కత్తెర

రాజ్యాంగం కల్పించిన చాలా హక్కులను గత ప్రభుత్వం కాలరాసింది. గతంలో ఆగస్టు 15 నాడు గ్రామ ప్రథమ పౌరుడిగా ప్రభుత్వ పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసే బాధ్యత సర్పంచ్‌లకు ఉండేది. అదో గౌరవంగా కూడా భావించేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ అధికారానికి కత్తెర వేసింది. తల్లిదండ్రుల కమిటీకి ఆ బాధ్యత అప్పగించింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పంచాయతీకి రూ.10 వేలు చొప్పున అందించింది.

ప్రతి పైసా పల్లెకోసం..



గ్రామసభలో తీర్మానం చేసిన పనులకు సంబంధించి ప్రతిపైసా పల్లెకు ఖర్చుచెయ్యాలి. గ్రామాల్లో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. వీటితో తాగునీరు, మురికికాలువలు, వీధి దీపాలతో పాటు గ్రామస్థులకు అవసరమైన చోట రోడ్లు నిర్మించాలి. పల్లెపండగ కార్యక్రమంలో చేపట్టే పనులకు సంబంధించి, పల్లెల్లో జరగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రగతిని నివేదించాలి.

- అంబేడ్కర్, కలెక్టర్, విజయనగరం

సంస్కృతిని ప్రతిబింబించేలా విజయనగరం ఉత్సవాలు

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. ఆదివారం ఆమె విజయనగరంలోని తన నివాసంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రతి ఏటా విజయనగరం ఉత్సవాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తు తరాలకు విజయనగరం చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది విజయనగరం ఉత్సవాలను ప్రభుత్వం మరింత వైభవంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎంతో శ్రమిస్తున్నదన్నారు. విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ సిరిమానోత్సవానికి సంబంధించిన తొలేళ్ల తదితర వాటిని కలిపి చేయడం వల్ల విజయనగరంతో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుంచి సిరిమానోత్సవానికి వచ్చే భక్తులకు వాటిని కూడా వీక్షించే అవకాశం ఉందన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఫ్లవర్‌షో, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను 12 వేదికలపైన ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర పండుగగా పైడిమాంబ సిరిమానోత్సవాన్ని 2019లో గుర్తించినప్పటికీ, గత ప్రభుత్వం ఆ స్థాయిలో ఉత్సవాన్ని నిర్వహించలేదన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని నిర్ణయించి, ఆ మేరకు సంప్రదాయాన్ని పాటిస్తూ నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయనగనరం నగరపాలక సంస్థతో పాటు, పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో సిరిమానోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. భక్తులకు ఉచిత దర్శనం కల్పించేందుకు నిర్ణయించామన్నారు. తొలేళ్ల, సిరిమానోత్సవం రోజున భక్తులు ఉచితంగా పైడిమాంబను దర్శించుకోవచ్చునన్నారు. ఇందుకు భక్తులు కూడా పూర్తిగా దేవదాయశాఖకు, జిల్లా అధికార యంత్రంగానికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కండి

బొబ్బిలి రూరల్: బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ శ్రీను ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 13 నీటి పారుదల చెరువులు, 5 మీడియం ఆయకట్టల సంఘాల రైతులను ఓటర్‌గా నమోదు చేయటానికి సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులంతా ఓటర్ జాబితా తయారీకి సిద్ధం కావాలని ఆదేశించారు. ఓటర్ జాబితా తయారు చేయటంలో పలు విధివిధానాలు, సూచనలు చేశారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ గౌరీ శంకర్, ఆర్ఐ రాంకుమార్, సిబ్బంది తదితురులు పాల్గొన్నారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని గాంధీనగర్ కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాట పూర్తయింది. సుమారు 20కేజీల లడ్డును దక్కించుకోవడానికి కాలనీ వాసులు పోటీ పడ్డారు. ఆదివారం రాత్రి వరకు జరిగిన వేలం పాటలో సీరపు లక్ష్మణరావు దంపతులు రూ.13వేలకు దక్కించుకున్నారు.

పైడిమాంబ పూజా విధానం పుస్తకావిష్కరణ

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ఆరాధ్యదేవత పైడిమాంబ అమ్మవారి పూజా విధానం పుస్తకాన్ని ఆదివారం పైడిమాంబ దీక్షా పీఠం, వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యాపాత్రో ఆధ్వర్యంలో పూసపాటి వంశీయులు, పైడిమాంబ అనువంశిక ధర్మకర్త, చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకాన్ని తొలుత ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకి అందజేశారు. పూజా విధానం పుస్తకానికి సహకరించిన డాక్టర్ ఎన్ శ్రీనివాస్ మోహన్ చేతుల మీదుగా భక్తులకు అందజేశారు. బొంగా మహేష్, అచ్చిరెడ్డి, శంకర్, వెంకటరావు, శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి సంధ్యారాణి
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

సాలూరు రూరల్: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజక వర్గంలో ఉన్న వివిధ గ్రామాల నుంచి పలువురు వచ్చి, తమ సమస్యలను విన్నవించారు. ఈ మేరకు ఆమె అధికారులకు ఫోన్ చేసి, సమస్యల పరిష్కారాని కి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఏ సమస్య వచ్చినా ఎప్పుడైనా వచ్చి తనకు వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆముదాల పరమేశు, గుల్ల వేణుగోపాలరావు, కనక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: డీఎస్సీ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణను అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు ఎండీ గయాజుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి ప్రారంభించిన ఈ ప్రక్రియకు 21వ తేదీతో గడువు ముగుస్తుందని, ఈలోగా అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల చేసుకోవాలన్నా రు. శిక్షణతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, 28వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష అనంతరం మెరిట్‌లిస్ట్ 30వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. నవంబర్ 3న కోచింగ్ సెంటర్ కేటాయింపు ఉంటుందని, ఆరో తేదీన నుంచి కోచింగ్ ఇస్తామని చెప్పారు.

తోటపల్లి అభివృద్ధికి దాతలు సహకరించాలి

గరుగుబిల్లి: చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధి మార్కొండ వాసునాయుడు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తోటపల్లి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, కొంతమేర అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు. దాతలు ముందుకు వస్తే నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

कैनरा बैंक Canara Bank
పూల్‌బాగ్ బ్రాంచ్ (8480)
పూల్‌బాగ్, విజయనగరం జిల్లా, ఎపి-535002. ఫోన్: 8331015676

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత: M/s. పర్‌ఫెక్ట్ బ్రైండ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న యజమానురాలు: శ్రీమతి. మిందతాన పావని, గారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ.97,16,437.71 (అక్షరాల తొంభై ఏడు లక్షల పదహారు వేల నాలుగు వందల ముప్పై ఏడు రూపాయలు మరియు డబ్బై ఒక్క పైసలు) + తదుపరి వడ్డీ మరియు ఒకవేళ ఛార్జీలు ఏమైనా ఉంటే అవి కలిపి మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది 29.07.2024 న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని తేది 08.10.2024న స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్ వారికి చెల్లించవలసిన బకాయి రూ. 99,61,801.71 (అక్షరాల తొంభై తొమ్మిది లక్షల అరవై ఒక్క వేల ఎనిమిది వందల ఒకటి రూపాయలు మరియు డబ్బై ఒకటి పైసలు) + వడ్డీ, ఒకవేళ ఛార్జీలు ఏమైనా ఉంటే అవి కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:

ఐటమ్ నెం.1: డాక్యుమెంట్ నెం. 4840/2017 ప్రకారం శ్రీమతి. మిందతాన పావని పేరునగల ఆస్తి: విజయనగరం జిల్లా, కొత్తవలస ఎస్ఆర్ఓ, లక్కవరపుకోట మండలం, భీమాలి గ్రామం, సర్వే నెం. 27-3 లోని మొత్తంలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా 4840 చ॥గ॥ లేదా 1471.36 చ॥మీ॥ల ఆర్‌సిసి శ్లాబ్ ఇల్లు. హద్దులు: తూర్పు: గేదెలవానిపాలెం రోడ్డు వైపు, దక్షిణం: మిందతాన సింహాచలం, గుళ్లేపల్లి సూరియేసుడు స్థలం, పడమర: చల్లా సత్యం, ముత్యాలనాయుడు, కిలపర్తి ముత్యాలనాయుడు మరియు ఇతరుల మెట్టభూమి, ఉత్తరం: గొర్లె నాని, కనకరత్నం, బలిఘట్టోయిన కళావతి మరియు ఇతరుల మెట్టభూమి.

ఐటమ్ నెం.2: డాక్యుమెంట్ నెం. 8/2018 ప్రకారం ప్రకారం శ్రీమతి మిందతాన పావని పేరునగల ఆస్తి: విజయనగరం జిల్లా, కొత్తవలస ఎస్ఆర్ఓ, లక్కవరపుకోట మండలం, భీమాలి పంచాయితీ, భీమిలి రెవిన్యూ గ్రామం, అసెస్‌మెంట్ నెం. 148, రిసెంట్ సర్వే నెం. 54, సర్వే నెం. 21-2 భాగం, డోర్ నెం. 1-205 గల ఆర్‌సిసి శ్లాబ్ ఇల్లు. ఖాళీ స్థలానికి కొలతలు: తూర్పు-పడమర: 53 అ॥ లేదా 16.11 మీ॥, ఉత్తరం నుండి దక్షిణం: 31 అ॥ లేదా 9.424 మీ॥. మొత్తం విస్తీర్ణం 182.55 చ॥గ॥ లేదా 163.59 చ॥మీ॥. ఆర్‌సిసి శ్లాబ్ ఇంటికి కొలతలు: తూర్పు-పడమర: 46 అ॥ లేదా 13.984 మీ॥, ఉత్తరం నుండి దక్షిణం: 25.5 అ॥ లేదా 7.6 మీ॥. మొత్తం బిల్డింగ్ విస్తీర్ణం 1173 చ॥అ॥ లేదా 130.33 చ॥గ॥ లేదా 116.79 చ॥మీ॥. హద్దులు: తూర్పు: 10 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: 30 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: బోని వెంకట రమణమ్మ యొక్క ఖాళీ స్థలం, ఉత్తరం: చల్లా సత్యవతి ఆర్‌సిసి స్లాబ్ ఇల్లు మరియు 170 అ॥ ఉన్న గోడ.

తేది: 08.10.2024
ప్రదేశం: విజయనగరం

సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్